


అధ్వానంగా అంతర్గత రోడ్లు 2


కాంగ్రెస్ నాయకుల నిరసనలు 2



AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో ఎస్ఐఆర్ పురోగతిపై ఆర్డీవో బుధవారం సమీక్ష నిర్వహించారు. తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన 'సర్' కొనసాగుతున్న తీరుపై చర్చించారు. ఇప్పటివరకు ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 87.53 శాతం ఎస్ఐఆర్ పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.






## ఎస్ఐఆర్ వందశాతం పూర్తవ్వాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ వందశాతం పూర్తవ్వాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నియోజకవర్గంలో 94శాతం మ్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి అమూల్యమని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటుహక్కును బలహీనపరిచే ఎలాంటి చర్యలనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. అలాగే ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, బీఎల్ఏలతో కీలక బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కో-ఆర్డినేటర్లు యాదయ్య, ధనలక్ష్మి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## 'బీజేపీ వైఖరిని ఖండిస్తున్నాం'



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** విద్యార్థులు తమ డిమాండ్ల కోసం ఆందోళన చేస్తే వారిపై లాఠీ ఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ పరీక్ష అవకతవకలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేశాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇలాంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనను అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందన్నారు. కీలక అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం ఉన్నా ప్రతిపక్షానికి అవకాశం కల్పించకుండా వ్యవహరించడం పార్లమెంటరీ సంప్రదాయాలను దెబ్బతీసే చర్య అన్నారు.



# ఎయిర్‌పోర్ట్ కలేనా..!

**జక్రాన్‌పల్లి గ్రీన్ ఫిల్డ్ విమానాశ్రయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) జక్రాన్‌పల్లిలో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలత ఉందని అధికారికంగా పేర్కొన్నప్పటికీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడట్లేదు.**

**- అక్షరటుడే, డిచ్‌పల్లి**

- **జక్రాన్‌పల్లి విమానాశ్రయం కోసం ఉమ్మడిజిల్లా వాసుల ఎదురుచూపులు**
- **జక్రాన్‌పల్లిలో అనుకూలతపై గతంలో నివేదిక**
- **అధికార పార్టీ నేతల చొరవే కీలకం**

జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భౌగోళికంగా అభ్యంతరాలు లేవని 'టెక్నో ఎకనామిక్ ఫిజిబిలిటీ' వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్‌లతో పాటు నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి ప్రతిపాదనలకు గతంలోనే అనుమతులు లభించాయి. అయితే, తాజాగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ కోసం 953 ఎకరాల భూమిని ఏఏఐకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అలాగే ఆదిలాబాద్‌లో భూసేకరణ శరవేగంగా జరుగుతుండడంతో నిజామాబాద్ వాసుల్లో ఆందోళన మొదలైంది. అన్ని అర్హతలు ఉండి, సర్వేలు పూర్తయినా నిజామాబాద్ పేరు ప్రస్తుత క్రియాశీలక జాబితాలో కనిపించకపోవడం ఉమ్మడి జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

### భౌగోళిక అనుకూలతలు..

జక్రాన్‌పల్లి మండలంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించి గతంలోనే క్షేత్రస్థాయిలో విస్తృతమైన సర్వేలు జరిగాయి. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, భూగర్భ వివరాలు అనుకూలంగా గుర్తించారు. తొర్లికొండ, కొలిప్యాక, అర్గుల్, మనోహరాబాద్, జక్రాన్‌పల్లిలో మొత్తం 1,668 ఎకరాలు గుర్తించి ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. ఈ ప్రాంతం 44వ నంబరు జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఉండడంతో అనుసంధానం చాలా సులభం అవుతుంది. నిజామాబాద్ నగరంతో పాటు నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల ప్రజలకు ఇది కేంద్ర బిందువుగా మారుతుంది. ఏఏఐ తన నివేదికలో ఇక్కడ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి రన్‌వే నిర్మాణం, ఏప్రెన్, టెర్మినల్ బిల్డింగ్‌ల ఏర్పాటుకు భౌగోళికంగా ఎలాంటి అడ్డంకులు లేవని, వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలమని స్పష్టం చేసింది.

### గల్ఫ్ కార్మికులు అధికం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు, గల్ఫ్ దేశాలకు విడదీయరాని బంధం ఉంది. దుబాయ్, సౌదీ అరేబియా, ఒమన్, ఖతార్, కువైట్, బహ్రెయిన్‌కు వలస వెళ్లే కార్మికుల్లో అత్యధిక శాతం మంది ఉమ్మడి నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతానికి చెందినవారే అత్యధికంగా ఉన్నారు. అలాగే యూరప్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో స్థిరపడ్డ, ఉన్నత చదువులు అభ్యసిస్తున్న వారు అనేక మంది. వేలాది మంది గల్ఫ్ కార్మికులు ప్రతీ రోజూ హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్ళాల్సి వస్తోంది. నిజామాబాద్ నుండి శంషాబాద్ చేరుకోవడానికి కనీసం 5 గంటలకు పైగా సమయం పడుతుంది.

### బలమైన రాజకీయ ప్రాతినిధ్యం

ప్రస్తుత రాజకీయ సమీకరణాల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్ట్ సాధించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని మేధావులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు ప్రభుత్వ సలహాదారులుగా ఉన్నారు. వీటన్నింటికీ మించి అధికార కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. ఇంతటి బలమైన రాజకీయ ప్రాతినిధ్యం ఉన్న తరుణంలో, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ ఫైల్‌ను తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

### ఎయిర్ పోర్టు ఏర్పాటుతో ప్రయోజనం

ఎయిర్‌పోర్ట్ ఏర్పాటైతే ఉత్తర తెలంగాణ ముఖచిత్రం మారిపోతుంది. జక్రాన్‌పల్లి విమానాశ్రయం కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా, ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, వ్యవసాయ రంగాన్ని మలుపు తిప్పగల సామర్థ్యం ఉంటుంది. నిజామాబాద్ జిల్లా పసుపు, వరి పంటలకు ప్రసిద్ధి. ఇక్కడ ఎయిర్‌పోర్ట్ వస్తే రవాణా సౌకర్యాలు మెరుగై, ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం లభిస్తుంది. ఎయిర్‌పోర్ట్ అనుబంధ పరిశ్రమలు, హోటళ్లు, రవాణా రంగం అభివృద్ధి చెంది స్థానిక యువతకు వేలాది ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

## వైటీపీఎస్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని సీహెచ్‌పీ, ఏహెచ్‌పీ, విభాగాల ఓఅండ్ఎం నిర్వహణను కాంప్రహెన్సివ్ అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. ప్రైవేటీకరణ చర్యలను నిరసిస్తూ, వైటీపీఎస్ ఉద్యోగులకు మద్దతుగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పవర్ హౌస్ ఎస్ఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ నిర్ణయం ఉద్యోగుల భవిష్యత్తుకే కాకుండా సంస్థ మనుగడకు తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో టీజీపీఈజేఏసీ జనరల్ సెక్రెటరీ పూదరి గంగాధర్, కోకన్వీనర్ తోట రాజశేఖర్, నాయకులు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



## బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా జస్పాల్ సింగ్ నియమాకం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా నూతన అధ్యక్షుడిగా జస్పాల్ సింగ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా నాయకత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన జస్పాల్ సింగ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన బీజేపీ అధిష్ఠానానికి, ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న రోజుల్లో పార్టీ ఆదేశానుసారం జిల్లాలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తూ, బీజేపీ బలోపేతానికి తనవంతు శ్రమించి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి, పార్టీ అభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటానని వెల్లడించారు.

## 'నీట్' విషయంలో కేంద్ర ప్రభుత్వానివి తప్పుడు విధానాలు: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** 'నీట్' విషయంలో కేంద్ర ప్రభుత్వానివి తప్పుడు విధానాలని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ మేరకు నగరంలో మీడియాతో మాట్లాడారు. నెలరోజులుగా నీట్ పరీక్ష విషయంలో న్యాయం చేయాలని విద్యార్థులు అడిగితే వారిపై లాఠీఛార్జీ చేయడం కేంద్ర ప్రభుత్వ అరాచక చర్య అని సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామాపై మాట్లాడకుండా విద్యార్థుల ఉద్యమాన్ని అణగదొక్కేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అమానుషమైన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ అయిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. విద్యార్థుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం ముమ్మరం చేస్తామని ప్రభుత్వ సలహాదారు తెలిపారు. ఉద్యమాలను అణిచివేయడంలో బీజేపీ ప్రభుత్వం బ్రిటిష్ వాళ్లను సైతం మించిపోయిందని విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం మానుకోవాలని.. ఈ దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సుదర్శన్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ



ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పారిపెల్లి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం వచ్చిందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నివాసం ముందు ధర్నా చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేసిన చర్యను ఖండిస్తూ బుధవారం కామారెడ్డి పట్టణంలోని గంజ్ మార్కెట్ యార్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు పట్టణంలోని రైల్వే కమాన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా గుండాలకు పోలీస్ యూనిఫామ్ వేయించి రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేని ఈ ప్రభుత్వం




ఈ ప్రజాస్వామ్య దేశంలో కొనసాగడానికి వీల్లేదని, ఈ విషయాన్ని ప్రతి పౌరుడు గమనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, పట్టణ అధ్యక్షుడు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## కాక్రోజ్.. దేశ ద్రోహుల పార్టీ : ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** కాక్రోజ్ పార్టీకి మద్దతు తెలుపుతున్న పార్టీలు, నాయకులు దేశద్రోహానికి పాల్పడినట్టేనని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ప్రధాని నివాసం వద్ద అరాచకం సృష్టించిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బుధవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఒకప్పుడు ఆప్ పార్టీ సోషల్ మీడియా వలంటీర్‌గా పనిచేశాడని గుర్తు చేశారు. ప్రధాని మోదీ భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రస్థానానికి తీసుకొచ్చేందుకు కష్టపడుతుండగా.. కాంగ్రెస్ మాత్రం అధికారం కోసం అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. కాక్రోచ్ పార్టీకి మద్దతు తెలుపుతున్న నాయకులంతా దేశద్రోహులేనని ధ్వజమెత్తారు. దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్ గతంలో జాతీయ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టడంతో, ఆయనపై జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, ఇప్పకాయల కిషోర్, చింతకాయల రాజేందర్, బెల్లాల్ శశాంక్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ పాల్గొన్నారు.






## వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ హెచ్చరించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి ఆస్పత్రిలోని పలు విభాగాలు, ల్యాబ్‌తో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ రికార్డులు, సిబ్బంది హాజరు, అత్యవసర మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆరోగ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, కాచి చల్లార్చిన నీటిని తాగడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు నిరంతరం పర్యటిస్తూ జ్వరం బారిన పడిన వారి వివరాలను సేకరించి సకాలంలో వైద్యం అందించాలని ఆదేశించారు. ఆమె వెంట మండల వైద్యాధికారి అజయ్ పవార్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు ఆన్నారు.

## ఘనంగా జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ పతాక స్వీకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. 1947 జూలై 22న భారత రాజ్యాంగ సభ త్రివర్ణ పతాకాన్ని అధికారికంగా ఆమోదించిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాతో దేశభక్తిని చాటుకున్నారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ జాతీయ జెండా ప్రాముఖ్యత, దాని రూపకల్పన, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావనను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అలాగే జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య సేవలను స్మరించుకుని ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు..

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపిన తండావాసులు

ఉమ్మడిజిల్లాలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. నిజామాబాద్ నగరంతో పాటు పట్టణాల్లో మట్టి రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే తండాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు స్పందించి బీటీ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

–అక్షరటుడే, లింగంపేట



### దీనస్థితిలో తండా రోడ్డు..

దేవుడు కరుణించిన పూజారి వరం ఇవ్వట్లేదు అన్న చందంగా మారింది ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితి. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. లింగంపేట మండలంలోని అయ్యపల్లి విఠల్ నాయక్ తండాకు 800 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో తండాకు చెందిన గిరిజనులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు.



### రూ. 70 లక్షల నిధులు మంజూరు

లింగంపేట్ గోపాల్‌పేట బీటీ రోడ్డు నుంచి అయ్యప్పల్లి తండాకు రెండేళ్ల క్రితం 800 మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.70 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు మంజూరు కావడంతో తండావాసులు ఆనందం వ్యక్తం చేసి పాలాభిషేకాలు చేశారు. కానీ రోడ్డు నిర్మాణం పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అధ్వానమైన రోడ్డు కారణంగా కనీసం ఆపద సమయాల్లో అంబులెన్స్ వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తండా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి తండాకు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

### బైక్‌లో జారిపడే ప్రమాదం..

వర్షాకాలంలో మట్టి రోడ్లపై ద్విచక్ర వాహనదారులు జారిపడిన ఘటనలు కోకొల్లలు. ఇక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు కనీసం నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వర్షం నీరు నిల్వ ఉండడంతో గుంతలు కనిపించక ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మట్టి రోడ్ల స్థానంలో బీటీ లేదా సీసీ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రోటరీ నగరంలో బురదమయమైన రోడ్లు..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చినుకుపడితే చాలు మట్టి రోడ్లు పూర్తిగా బురదగా మారి ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. నగరంలోని 7వ డివిజన్‌లోని రోటరీ నగర్‌లో రోడ్ నం.6లో పరిస్థితి అధ్వానంగా మారింది. కాలనీలోని రోడ్లపై బురదమయంగా మారడంతో కాలనీవాసులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

అయ్యపల్లి తండాకు రోడ్డు నిర్మించడానికి 800 మీటర్లకు రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ విషయం పై ఉన్నతాధికారులకు నివేదించా. – ఐశ్వర్య, ఆర్‌అండ్‌బీ ఏఈ



## పోచంపాడ్ ఎన్యూమరేషన్ కేంద్రం పరిశీలన

**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్‌లో కొనసాగుతున్న ఓటర్ల ఎన్యూమరేషన్ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల ఇన్‌ఛార్జి వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో మిగిలి ఉన్న ఒకటి, రెండు శాతం ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్వోలు, బీఎల్ఏలకు సూచించారు. ప్రతి అర్హ ఓటరు వివరాలు నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, చందు, సంతోష్, అచ్చు, పైదొద్దీన్, గంగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



## అధ్వానంగా కాటేవాడి రోడ్డు..

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని కాటేవాడి తండాకు వెళ్లే రోడ్డు నడవలేని స్థితిలో ఉంది. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తండాకు రోడ్డు వేయిస్తామని నాయకులు పలుమార్లు చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం జరగట్లేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడాల్సి వస్తోందన్నారు. గతంలో బైక్‌లపై నుంచి జారిపడి ప్రమాదాలకు గురయ్యారన్నారు. రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి


**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరి సాగుకు బదులుగా అరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏవో ఆంజనేయులు సూచించారు. నడిపల్లి రైతు వేదికలో రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో లోటు వర్షపాతం ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి పంటకు బదులుగా మొక్కజొన్న, కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఆరుతడి పంటల సాగు వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడిని అవలంబించడం ద్వారా రైతులు




నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సతీష్, శ్రావణ్ కుమార్, జ్ఞానేశ్వర్, విలాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నందిపేటలో భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర

**అక్షరటుడే,నందిపేట్:** మండల కేంద్రంలో జగన్నాథ స్వామి రథయాత్ర వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ స్వామి, బాలభద్రుడు, సుభద్ర అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై ప్రతిష్ఠించి ప్రధాన రహదారి గుండా ఊరేగించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో పాటు ప్రత్యేక వేషధారణలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పెద్ద సంఖ్యలో మహిళలు యువత పాల్గొని భజనలు కీర్తనలు మంగళ వాయిద్యాల మధ్య రథాన్ని లాగారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గత రెండు నెలలుగా



ఇస్కాన్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి




**అక్షరటుడే, ఇందూరు:** విదేశాలతో భారత ప్రభుత్వం కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మోర్చా నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్ది వెంకట్రాములు, వేల్పూర్ భూమయ్య, బి.దేవారం, ఆకుల పాపయ్య మాట్లాడారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్‌ను ఆక్రమించి, దేశీయ పంటలకు గిట్టుబాటు ధరలు పడిపోతాయన్నారు. చిన్న రైతులు, పాడి పరిశ్రమ తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతులపై ఆంక్షలు విధించి, స్వదేశీ ఉత్పత్తుల పెంపకానికి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో దేవేందర్ సింగ్, దేవునూరి రాజన్న, రాజేశ్వర్, గంగారెడ్డి, సారా సురేష్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ముగియనున్న దక్షిణముఖి ఆంజనేయస్వామి అఖండ రుద్రాభిషేకం

**అక్షరటుడే, బోధన్:** సమృద్ధిగా వర్షాలు కురవాలని వేడుకుంటూ పట్టణంలోని బ్రాహ్మణ గల్లీలో గల దక్షిణముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో 72 గంటలుగా నిర్వహిస్తున్న అఖండ రుద్రాభిషేక మహోత్సవం గురువారం ముగియనుంది. ఉదయం 10 గంటలకు స్వామివారి మహాభిషేకం, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయి. ముగింపు మహోత్సవానికి భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర పట్వారి, కోశాధికారి శ్రీనివాస్, బీర్కూర్ బుజ్జి శంకర్, బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షుడు ప్రవీణ్ మహారాజ్ కోరారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా

**అక్షరటుడే, బాల్కొండ/ఆర్మూర్:** ఢిల్లీలో రాహుల్ గాంధీని అరెస్ట్ చేసినందుకు నిరసనగా జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు నిరసనలకు దిగారు. రాస్తారోకోలు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలోని కెనాల్ వంతెన వద్ద కాంగ్రెస్ నాయకులు రాస్తారాకో నిర్వహించారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసన తెలిపిన రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్కొండలోని పాత జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. పార్టీ నేతలు రాహుల్ గాంధీ అరెస్టును, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, ప్రధాన కార్యదర్శి యూనస్, మండలాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు చేని నగేష్, వెంకట్ గౌడ్, అరవింద్, మోహన్ రెడ్డి, ఇమ్రాన్, సయ్యద్ మజారుద్దీన్, సయ్యద్ రియాజ్, షేక్ వహాబ్, శ్రీనివాస్, సంజీవ్ గౌడ్, హరికృష్ణ, విక్కీ ముదిరాజ్, కపిల్, రవీందర్ గౌడ్, కిషన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## పార్కిన్సన్ బాధితుడికి ఎల్‌వోసీ మంజూరు

**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన మాడవేడి బాలకుమార్ పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, బాధితుడి వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి రూ.2,25,000 విలువైన ఎల్‌వోసీని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించి ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి బాలకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం సమాధానం చెప్పాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** నీట్ పేపర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును తాము ఖండిస్తున్నామన్నారు. నీట్ మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మొహసిన్, కౌన్సిలర్ మహమ్మద్ కాలిక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మన్సూర్, నందకిషోర్, కోఆప్షన్ సభ్యులు కమర్ గౌస్, అబ్దుల్ మజీద్, వహాబ్ బై, మాజీ జెడ్పీటీసీ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ నగేష్, గుడాల నగేష్ పాల్గొన్నారు.

